పనుల్లేక పరేషాన్

- ఉపాధి హామీ పథకంలో తగ్గిన కూలీల సంఖ్య
- సంఖ్య పెంచాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి అధికారుల ఆదేశాలు
- పూడికతీత పనులకు నిబంధనలు
- వేసవిలో కూలీలకు అందని అలవెన్స్‌లు





మానకొండూర్‌: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్య చాలా వరకూ తగ్గిపోయింది. పనులకు నామ మాత్రంగా కూలీలు హాజరవుతున్నారు. కూలీల సంఖ్య పెంచాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి అధికారులు సూచనలు చేస్తున్నా కూలీల సంఖ్య మాత్రం పెరగడం లేదనే ఆవేదన క్షేత్ర స్థాయి సి బ్బందిలో స్పష్టమవుతోంది. చిన్న గ్రామాల్లో 20 మంది కూలీలు, పెద్ద గ్రామాల్లో 80 మించడం లే దు. కూలీల సంఖ్య తగ్గడానికి, సరిపడా పనులు లే కపోవడం ఓ కారణమైతే వేసవిలో కూలీలకు అలవెన్స్‌లు లేకపోవడం మరో కారణంగా చెబుతున్నారు.

వేసవిలో కూలీలకు పనులు దొరక్క ఇంటి వద్దే ఉంటున్నారు. ఇలాంటి సమయంలో కూలీలు ఉపాధి హామీ పనికి వెళ్దామన్నా కూలీలందరికి సరిపడా పనులు లేవు. ఉపాధిహామీ పథకం కింద ప్రస్తుతం పాంపాండ్స్‌, ఫార్మేషన్‌ రోడ్లు, కొత్త కాలువల ఏర్పాటు పనులే నామ మాత్రంగా కొనసాగుతున్నాయి. అనుకున్న స్థాయిలో పనులు లేకపోవడంతో కూలీల సంఖ్య తగ్గిందని క్షేత్రస్థాయి ఉపాధిహామీ సిబ్బంది వాపోతున్నారు.

కూలీల సంఖ్య పెంచాలని ఆదేశం

కూలీల సంఖ్య పెంచాలని అధికారుల ఆదేశాలతో క్షేత్ర స్థాయి సిబ్బది ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు సరిపడా పనులు లేవని చిన్నపాటి పనులే కొనసాగడంతో కూలీలకు పనులు కల్పించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం కూలీలను పనులకు తీసుకురావాలని కొండంత టార్గెటు విధించారు. గ్రామానికో వంద మంది కూలీల చొప్పున పనులకు వచ్చేలా చూడాలని అధికారులు టార్గెటు విధించారు. అయితే గ్రామాల్లో పెద్దపెద్ద పనులు లేని కారణంగా కూలీల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం చిన్న గ్రామాల్లో 30 మంది పెద్ద గ్రామాల్లో 70, 80 మంది కూలీలు మాత్రమే పనులకు వెళ్తున్నారు.

నిబంధనలు సడలిస్తే..

ఫీడర్‌ చానల్స్‌, చెరువు కుంటల్లో పూడిక మట్టిని తీసి కట్టల బలోపేతం, అలాగే రైతుల పంట పొలాలకు తరలిస్తే మేలు జరుగుతుంది. చెరువు కుంటల్లో మట్టిని పంట పొలాల్లో పోయాలని రైతులు కూడా కోరుతున్నారు. అయితే ఫీడర్‌ చానల్స్‌, చెరువు కుంటల్లోని మట్టిని తీయొద్దనే నిబంధనలున్నాయని అధికారులు చెబుతున్నారు. పనికి వచ్చే కూలీలకు పనులు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని కూలీలు కోరుతున్నారు.

పంట పొలాలకు మట్టి అవసరం

చెరువు, కుంటల్లోని సారవంతమైన మట్టి పంట పొలాలకు అవసరం. వేసవిలో చెరువు, కుంటల్లోని మట్టిని తరలించుకునేందుకు మంచి అవకాశం ఉంటుంది. ఉపాధిహామీ సిబ్బంది మాత్రం అలాంటి అవకాశం ఇప్పుడు లేదంటున్నారు. దీనిపై నిబంధనలున్నాయంటున్నారు. చెరువు, కుంటల్లోని మట్టిని తీయడం వల్ల రైతులకే కాదు కూలీలకు పని కూడా దొరుకుతుంది.

శ్రీసీతారామచంద్రస్వామి శోభాయాత్ర



స్వామివారి శోభాయాత్రకు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న భక్తులు

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌లో శ్రీసీతారామచంద్రస్వామి శోభాయాత్రను గ్రామస్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన ఆలయంలో నాలుగు రోజులుగా లక్ష్మణ సమేత శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా చేపట్టారు. ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. మహిళా భక్తులు స్వామివారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని బేతిగల్‌ గ్రామంలో శ్రీభూలక్ష్మి, మహాలక్ష్మి బొడ్రాయి, పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించి 41 రోజులు గడిచిన సందర్భంగా పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్రీధరాచార్యులు, నరసింహాచార్యుల ఆధ్వర్యంలో



వీణవంక: పూజలు చేస్తున్న అర్చకులు

మండల పూజ, అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు వేణుశర్మ, మణికంఠా చార్యులు, అభిరామచార్యులు, మాజీ సర్పంచ్‌లు మోరె సారయ్య, గొట్టిముక్కల సంపత్‌రావు, మాజీ ఉపసర్పంచ్‌ చొప్పరి తిరుపతి, మాజీ ఎంపీటీసీ మోరె స్వామి, రిటైర్డ్‌ టీచర్‌ దామోదర్‌, గొట్టి పుల్లయ్య, కారోబార్‌ పల్లెర్ల మహేశ్‌ గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిత్రకారుల దినోత్సవం



సీనియర్‌ ఆర్టిస్ట్‌ను సన్మానిస్తున్న సభ్యులు

జమ్మికుంట: పట్టణంలో ఆర్టిస్ట్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ చిత్రకారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సీనియర్‌ ఆర్టిస్ట్‌ శిల్పాభాస్కర్‌ మాట్లాడుతూ.. టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఫ్లెక్సీలు, ప్రింటింగ్‌ కావడంతో ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలతో ఆర్టిస్టులను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆర్టిస్టులు అంబాల ప్రభాకర్‌, వీరస్వామి, బ్రహ్మం, భువనేశ్వర్‌, సంతోష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కేంద్రాలను ప్రారంభిస్తున్న సుధాకర్‌

సైదాపూర్‌: రైతుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సైదాపూర్‌ ఏఎంసీ చైర్మన్‌ దొంత సుధాకర్‌ అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అత్యధికంగా మహిళా సంఘాలకు కేటాయించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కుమారస్వామి, వైస్‌ చైర్మన్‌ రాజ్‌కుమార్‌, ఐకేపీ సీసీలు జమున, రాజేశ్వరి, వీవోఏలు వాణిశ్రీ, రజిత, నిర్మల రైతులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న రాకేశ్‌, తదితరులు

జమ్మికుంట: పట్టణంలోని రైల్వే స్టేషన్‌ దగ్గర ఫుట్‌పాత్‌పై ఉన్న చేపల మార్కెట్‌ను పాత మార్కెట్‌ రైతు బజార్‌కు తరలించాలని మున్సిపల్‌ కమిషనర్‌ ఎండీ ఆయాజ్‌కు కాంగ్రెస్‌ పార్టీ ఫిషర్‌మెన్‌ రాష్ట్ర కార్యదర్శి పింగిళి రామేశ్‌ మంగళవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డుపై అమ్మకాలతో మత్స్యకారులకు నష్టం జరుగుతుందని, ట్రాఫిక్‌ అంతరాయం ఏర్పడుతుందని, పాత మార్కెట్‌లో రూమ్‌లు కేటాయించి, చేపలు అమ్ముకోవడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై ఫిర్యాదు చేస్తాం




మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని అంబేద్కర్‌ చౌరస్తా వద్ద నిర్వహించిన అంబేద్కర్‌ జయంతి వేడుకల్లో దళిత నాయకులను చిన్నచూపు చూసిన మున్సిపల్‌ కమిషనర్‌ ఎండీ ఆయాజ్‌పై కలెక్టర్‌, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నాయకులు మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ శీలం శ్రీనివాస్‌, మాజీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశం అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్‌ జయంతి తూతూ మంత్రంగా నిర్వహించారని, అన్నిపార్టీల వారు పాల్గొనేలా చర్యలు తీసుకోలేదని ప్రశ్నించగా నిర్లక్ష్యం సమాధానం ఇచ్చారని, కమిషనర్‌ క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు, పల్లపు రవి, గణేశ్‌, మోతె స్వామి, ఇటుకాల స్వరూప, రాజేశ్‌, ప్రశాంత్‌, కొమ్ము అశోక్‌ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం



గన్నేరువరం: అక్రమంగా తరలిస్తున్న 480 మద్యం బాటిళ్లను పోలీసులు 2023 నవంబర్‌లో పట్టుకొని సీజ్‌ చేశారు. డిప్యూటీ కమిషనర్‌ పీఆర్‌వో, ఎక్సైజ్‌ ఆదేశాల మేరకు మంగళవారం గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో ఎక్సైజ్‌ సీఐ బాబా, ఎస్సై శ్రీకాంత్‌ ఆధ్వర్యంలో ధ్వంసం చేశామని ఎస్సై నరేశ్‌ తెలిపారు.



గ్యారంటీలు అమలయ్యే వరకూ పోరాటం



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్‌/శంకరపట్నం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ అన్నారు. 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్‌ రజతోత్సవ పోస్టర్‌ను మంగళవారం వంకాయగూడెంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించి, 10 ఏళ్లు మంచిపాలన అందించిన కేసీఆర్‌ను ప్రజలు కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ఆరుగ్యారంటీలు అమలు చేసే వరకు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు మహిపాల్‌, మాజీ జెడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయాలి

రజతోత్సవ సభను విజయవంతం చేయాలని రసమయి బాలకిషన్‌ అన్నారు. మానకొండూర్‌లో రజతోత్సవ సభ పోస్టర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు కరీంనగర్‌ పుట్టినిల్లని, సింహగర్జనతో ఉద్యమం కరీంనగర్‌లోనే మొదలైందన్నారు. ఆవిర్భావం, పది సంవత్సరాలు అధికారం చేపట్టి, అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టామన్నారు. ఎల్కతుర్తి వద్ద జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలు, అభిమానులు, నాయకులను కోరారు. మాజీ జెడ్పీటీసీ శేఖర్‌ గౌడ్‌, మాజీ సర్పంచ్‌ గోపాల్‌ రెడ్డి, ఎరుకల శ్రీనివాస్‌ గౌడ్‌, నాయకులు సంపత్‌ రెడ్డి, గుర్రం కిరణ్‌ గౌడ్‌, మల్లయ్య, గోపు ఈశ్వర్‌ రెడ్డి పాల్గొన్నారు.

హుజూరాబాద్‌: బహిరంగ సభను విజయవంతం చేయాలని హుజూరాబాద్‌ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.



అగ్నిమాపక వారోత్సవాలు

మానకొండూర్‌: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మానకొండూర్‌ అగ్నిమాపక అధికారి భూదయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పల్లెమీద డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం వాల్‌ పోస్టరు అంటించడంతోపాటు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఇందుర్తి గ్రామ కార్యవర్గం



చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తిలో మంగళవారం సీపీఐ గ్రామశాఖ ఎన్నికలు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శిగా ఎండీ ఉస్మాన్‌, సహాయ కార్యదర్శిగా బండెల శ్రీనివాస్‌, అందె సంపత్‌, కోశాధికారిగా బింగి సంపత్‌, మరో 12 మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్‌, చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, అందె చిన్నస్వామి, కూన లెనిన్‌ పలువురు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

చొప్పదండి: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు హామీని వెంటనే నెరవేర్చాలని ఆల్‌ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు గుజ్జుల రవిందర్‌ రెడ్డిలు డిమాండ్‌ చేశారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ...కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నప్పటికీ కార్పొరేషన్‌ ఏర్పాటుపై పట్టింపు లేదని, యాభై ఏళ్లు నిండిన రైతులకు రూ.మూడు వేల ఫించన్‌ అమలు చేయాలని, రైతు భీమా పథకం అమలు చేసేందుకు రైతుల వయస్సు 65 ఏళ్లకు పెంచాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓసీలకు 20 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్‌ పక్వాడ

శంకరపట్నం: మండలంలోని ఏరడపల్లి, గద్దపాక అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారం గూర్చి సూపర్‌వైజర్లు అరుణ, పద్మలు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామంలో మంగళవారం మెడికవర్‌ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 120 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి హెడ్‌ కిరణ్‌, మేనేజర్లు కరుణాకర్‌, మనోజ్‌ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వప్న




గుండిలో ఎస్సై రాజు

చలివేంద్రం ప్రారంభం

జమ్మికుంట: బాల వికాస స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌ చైర్‌పర్సన్‌ పూల్లూరి స్వప్నసదానందం అన్నారు. మంగళవారం మండలంలోని మడిపల్లి గ్రామంలో బాలవికాస సభ్యులు అంబాల సుమలత శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో చలివేంద్రంను ప్రారంభించారు. వేసవిలో బాటసారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేయడం సేవ భావాన్ని కొనియాడారు. కార్యక్రమంలో బాల వికాస సెంటర్‌ మేనేజర్‌ పబ్బు సులోచన, మాజీ ఎంపీపీ నేరెళ్ల రాజమల్లు, మార్కెట్‌ కమిటీ డైరెక్టర ఎగ్గెటి సదానందం, కాంగ్రెస్‌ గ్రామశాఖ అధ్యక్షుడు ఉప్పుల సాంబశివరెడ్డి, నాయకులు అంబాల రాజు, మంగ అశోక్‌, తాళ్లపెల్లి అంజి, కోఆర్డినేటర్‌ స్వాతి, మహమ్మద్‌ అసియా బాల వికాస మహిళలు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గుండి బస్టాండ్‌ వద్ద మంగళవారం పొన్నం శ్రీనివాస్‌ గౌడ్‌ స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై రాజు ప్రారంభించారు. వేసవిలో దాహార్తి తీర్చడానికి యువత చలి వేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వాహనదారులు హెల్మెట్‌, సీట్‌బెల్ట్‌ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువత పాల్గొన్నారు.

సీడ్‌ప్లాంట్‌లో తనిఖీలు



సీడ్స్‌ప్లాంట్‌లో నార్కోటిక్‌ డాగ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌ శివారులోని సీడ్స్‌ప్లాంట్లలో మంగళవారం నార్కోటిక్‌ డాగ్‌తో పోలీసులు తనిఖీలు చేశారు. కావేరీ. చైతన్య సీడ్స్‌ప్లాంట్లలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పని చేస్తున్నారు. మత్తు పదార్థాలు సేవించకుండా ఇతర రాష్ట్రాల కార్మికులకు పోలీసులు అవగాహన కల్పించారు. వారు నివాసం ఉంటున్న గదులను నార్కోటిక్‌ డాగ్‌తో తనిఖీ చేశారు. కార్మికుల వేలిముద్రలను సేకరించారు. మత్తు పదార్థాలు తీసుకుంటే జరిగే అనర్థాలపై హుజూరాబాద్‌ రూరల్‌ సీఐ వెంకటి, ఎస్సై రవి అవగాహన కల్పించారు.

నియామకం

హుజూరాబాద్‌ : తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్‌గా మోరె గణేశ్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్‌ కోదండరాం నియమించారు. శంకరపట్నం మండలం మొలంగూర్‌ గ్రామానికి చెందిన గణేశ్‌ పట్టణంలో నివాసం ఉంటూ ప్రస్తుతం టీజేఎస్‌ యువజన రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నాడు. వెలుగు, నీడ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడిగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. టీజేపీ జిల్లా కన్వీనర్‌ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

హాకీ క్లబ్‌ నూతన కమిటీ

హుజూరాబాద్‌: హుజూరాబాద్‌ పట్టణంలోని హైస్కూల్‌ క్రీడా మైదానంలో అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్‌, జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్‌, గుడ్డేలుగుల సమ్మయ్యల ఆధ్వర్యంలో హాకీ క్లబ్‌ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట రాజేంద్రప్రసాద్‌, సెక్రటరీగా బొడిగె తిరుపతిగౌడ్‌, ఉపాధ్యక్షులుగా భూసారపు శంకర్‌, ఆరెల్లి రమేశ్‌, వేముల రవికుమార్‌, ఎండీ యూసుఫ్‌, జాయింట్‌ సెక్రెటరీగా శ్యాం సుందర్‌, రాజు, ప్రదీప్‌, సాయికృష్ణ, ట్రెజరరీగా రాజేష్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా కె. రాజేష్‌, విక్రమ్‌, భాస్కర్‌ తదితరులు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్‌ బైక్‌ దగ్ధం



హుజూరాబాద్‌: మున్సిపల్‌ పరిధిలోని అహల్యానగర్‌లోని బోర్నపల్లి రోడ్డుపై మంగళవారం ఎలక్ట్రిక్‌ బైక్‌ దగ్ధమైంది. ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తున్న సమయంలో ఎలక్ట్రిక్‌(ఎండీఎంఎస్‌) వాహనం నుంచి మంటలు వస్తుండడాన్ని గమనించి బైక్‌ను వదిలేసి వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న హుజూరాబాద్‌ ఫైర్‌సిబ్బంది మంటలను ఆర్పేశారు. కాగా వాహనం ఎవరిదనే విషయం తెలియాల్సి ఉంది.

మత్తుపదార్థాలు-అనర్థాలపై అవగాహన



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్‌, లెక్చరర్స్‌

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్‌ డా.రమేష్‌ అధ్యక్షతన యాంటి డ్రగ్స్‌ కమిటీ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలు-అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్‌, డా.బీఆర్‌ అంబేద్కర్‌, మహాత్మాజ్యోతిరావుపూలే మహనీయుల జయంతిని పురస్కరించుకొని రంగోళి, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపల్‌ డా. ఓదెలుకుమార్‌, యాంటి డ్రగ్స్‌ కమిటీ కోఆర్డినేటర్‌ రాజ్‌కుమార్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ ఈ.రవి, ఎల్‌ రవీందర్‌, అధ్యాపకులు గణేశ్‌, మాధవి, శ్యామల, రాజేంద్రం, కిరణ్‌కుమార్‌, ఉమాకిరణ్‌, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారినపడొద్దు



ఇటుక బట్టీల వద్ద కార్మికులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్‌ ఎడ్యుకేటర్‌, సిబ్బంది

జమ్మికుంట: పట్టణంలోని ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికులకు వావిలాల పీహెచ్‌సీ హెల్త్‌ ఎడ్యుకేటర్‌ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వడదెబ్బ, ఎండ తీవ్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వడదెబ్బ నివారణకు రోజుకు పది గ్లాసుల నీరు, బయటకు వెళ్లే సమయంలో గొడుగు, టోపి, తలపాగ, తెల్లని కాటన్‌ దుస్తువులు ధరించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని, ఎండ తీవ్రతతో డిహైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్‌ఎస్‌ తాగాలని సూచించారు. అనంతరం ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్‌ సూపర్‌వైజర్‌, అరుణ, ఏఎస్‌ఎం రజిత, హెల్త్‌ అసిస్టెంట్‌ నరేందర్‌, ఆశావర్కర్‌ రహిమా సుల్తానా కార్మికులు పాల్గొన్నారు.

వడ్లు కొనుగోలు చేయాలని డప్పు చాటింపు



తిమ్మాపూర్‌: జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తూకం చేపట్టడంలేదని డప్పు చాటింపు వేశాడు సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి డిమాండ్‌ చేశారు. తిమ్మాపూర్‌ మండల కేంద్రంలో మంగళవారం కల్లాల దగ్గర మేల్కొల్పే డప్పు చాటింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా కనీసం 20 కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సంపత్‌, మండల కార్యదర్శి శంకర్‌, నాయకులు వెంకటస్వామి కుమార్‌, నాగరాజు, కుమార్‌, మొగిలి, రాజయ్య, వెంకటేష్‌,శంకర్‌ పాల్గొన్నారు.

19న హ్యాండ్‌బాల్‌ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్‌: ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నగరంలోని అకాడమిక్‌ హైట్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో ఈనెల 19న ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్‌ మహిళల హ్యాండ్‌బాల్‌ జట్టు, సౌత్‌ జోన్‌ సీనియర్స్‌, మహిళల, పురుషుల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్‌ తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో మధ్యాహ్నం 3 గంటలకు పాఠశాలలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94419 25807, 8978995730 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కరీంనగర్‌కార్పొరేషన్‌: నగరంలోని 22వ డివిజన్‌ సుభాష్‌నగర్‌లో సుడా నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు మంగళవారం సుడా చైర్మన్‌ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ రొడ్డ యాదగిరి, టీపీఓ వేణు, టీపీఎస్‌ సంధ్య, మాజీ కార్పొరేటర్‌ గంట కల్యాణి తదితరులు పాల్గొన్నారు.